ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం 14 మే 2026
సంపుటి: 28 సంచిక: 47
Thursday 14 May 2026
Vol.No 28 Issue No .47
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in



## హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పోరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి

హైదరాబాద్,మే 13 : హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు మిగతా2లో..



## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట



న్యూఢిల్లీ,మే13 : పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు మిగతా2లో..

## నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

- దేశంలో ఏకకాలంలో సోదాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన

మిగతా2లో..






## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ

మహబూబాబాద్,మే13 : భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి మిగతా2లో..

## మెగా గ్రోత్ కారిడార్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- భవిష్యత్ తెలంగాణకు మెగా మాస్టర్ ప్లాన్
- ఖమ్మం వరంగల్ కరీంనగర్‌కు ఔటర్ రింగ్ రోడ్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్టీపీలకు ప్రాధాన్యం
- ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ వినియోగంపై దృష్టి
- సింగరేణి మున్సిపాలిటీలను ఒకే యూనిట్‌గా అభివృద్ధి
- అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు
- ఎయిర్‌పోర్టులతో మారనున్న తెలంగాణ రూపురేఖలు
- రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన అర్బన్ ప్లానింగ్‌కు సీఎం ఆదేశం



హైదరాబాద్,మే13 : ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మెగా గ్రోత్ కారిడార్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, తెలంగాణ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ & డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రాబోయే ఎయిర్‌పోర్టులను దృష్టిలో ఉంచుకుని రహదారుల నిర్మాణం చేపట్టాలని, అవసరమైన ఎస్టీపీలను డిజైన్ చేయాలని సూచించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాల్లో ఆధునిక సాంకేతికత వినియోగించాలని, ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ ఆధారిత సాంకేతిక సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఖర్చు తగ్గించేందుకు ఈవీ మిగతా2లో..

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని




పుదుచ్చేరి,మే13 : కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన మిగతా2లో..

## బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్,మే13 : ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మిగతా2లో..

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్,మే13 : పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో..

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్



హైదరాబాద్,మే13 : తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిగతా2లో..

## పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



మిగతా2లో..

హైదరాబాద్,మే13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం

## 15న ఆధారాలతో విచారణకు వస్తా

- పోలీసులకు బండి భగీరథ్ లేఖ

మిగతా2లో..



## ప్రధాని మోడీ పొదుపు పిలుపు ఆవశ్యం



- మనం కూడా ఆచరించి భాగస్వాములం అవుదాం
- కాన్వాయ్‌లు, భద్రతా సిబ్బందిని కుదించుకుందాం
- నిడమర్రులో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు

అమరావతి,మే13 : పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 సూచనలను మనం పాటించాలని.. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని దిశానిర్దేశర చేశారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు మిగతా2లో..

## అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

- అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక
- టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ
- తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి
- కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు
- కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు




అమరావతి,మే13 : అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య మిగతా2లో..

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అన్నాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్

చెన్నై,మే13 : తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు మిగతా2లో..



## అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 15న ఆధారాలతో విచారణకు వస్తా

హైదరాబాద్,మే 13 : పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

## ప్రధాని మోడీ పొదుపు పిలుపు ఆవశ్యం

బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని.. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటీ అని.. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుందని.. దీనిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయని.. దేశం మొత్తం దుబారాను తగ్గించాలని మార్గనిర్దేశర చేశారు. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్‌గా మారిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని.. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ సూచించారని.. దీనిని కూడా మనం పాటిద్దామని పిలుపునిచ్చారు. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయని వివరించారు. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే మన పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. 'నాదేశం- నా బాధ్యత' అనే ఆలోచనను ప్రజలంతా ఆచరించాలని అన్నారు. రెండు రోజుల్లో ఈ విషయంపై చర్చించి స్పష్టమైన ప్రకటన చేస్తామని తెలిపారు. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారని ప్రస్తావించారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ÷ూఎఖీతో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## తప్ప చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశు సంవర్థక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ అప్రమత్తతో ఉన్నారని స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పశుసంవర్థక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడారు. పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్థక శాఖ డైరెక్టర్ గోపీ, శాంతిభద్రతల డీజీపీ మహేశ్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

## నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

న్యూఢిల్లీ,మే13 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## మెగా గ్రోత్ కారిడార్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

వాహనాలను ప్రవేశపెట్టాలని, లీజ్‌కు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే కావాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పట్టణంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రేడియేషన్ తగ్గించేందుకు మల్టీ యుటిలిటీ టవర్లు, ప్రతి చోట స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు పట్టణ ప్రణాళికలో తప్పనిసరిగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. సీవరేజ్ & వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో వినియోగించేలా నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన నీటి అవసరాలను ముందుగానే ప్రణాళికలో చేర్చాలని, సింగరేణి పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని అన్నారు.

నల్గొండయాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్‌నాగోబాబాసరకడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్, మహబూబ్‌నగర్‌భూత్పూర్‌జడ్చర్ల, కొత్తగూడెంపాల్వంచసుజాతనగర్ మధ్య కారిడార్‌ల ఏర్పాటు పై సీఎం దృష్టి సారించారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి చేపట్టాలని సూచించారు. రేడియల్ రోడ్లు పెద్ద మున్సిపాలిటీలకు సమీపంగా ఉండేలా రూపకల్పన చేయాలని, వచ్చే 25 ఏళ్ల అవసరాలకు సరిపోయేలా ప్రతి ప్రాజెక్టును డిజైన్ చేయాలని సీఎం ఆదేశించారు.
వరంగల్‌కరీంనగర్‌ఖమ్మం కారిడార్ భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి కీలకమని, ఎయిర్‌పోర్టుల రాకతో ఈ ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని పేర్కొన్నారు.
ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను డిఫెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, ఎస్టీపీల నిర్మాణం, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వినియోగం వంటి అంశాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్టును 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్‌పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్‌పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్‌పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

# సంపాదకీయం

# ఎన్‌టిఏ వైఫల్యంతో విద్యార్థులకు శాపం !

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఏను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఏ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఏ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పించడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది.ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం.

ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చున్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# మానవ హక్కుల పరిరక్షణపై షార్ట్ ఫిల్మ్ పోటీలు

**ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో యువత, సినీ అభిరుచి గలవారు పాల్గొనాలి : జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ: 13 మే 2026 : మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ (చీఠ=జ) ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించి 12వ జాతీయ స్థాయి "హ్యూమన్ రైట్స్ షార్ట్ ఫిల్మ్ కాంపిటిషన్" నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ నేడొక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా మానవ హక్కుల పట్ల చైతన్యం కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి భారత పౌరుడు పాల్గొనవచ్చని తెలిపారు. 3 నుండి 10 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌లను ఏ భారతీయ భాషలోనైనా రూపొందించవచ్చని, అయితే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో రూపొందించిన చిత్రాలను కూడా పంపవచ్చ న్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.2,00,000/-, ద్వితీయ బహుమతి రూ.1,50,000/-, తృతీయ బహుమతి రూ.1,00,000/- కాగా, ప్రత్యేక ప్రస్తావనకు ఎంపికైన నాలుగు చిత్రాలకు తలా రూ.50,000/- చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాకతీయ యూనివర్సిటీ, సాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్లు జిల్లా పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలలకు తెలియజేయాలని, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అన్ని జూనియర్ కళాశాలలకు, జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలకు, జిల్లా పంచాయతీ అధికారి గ్రామపంచాయతీలకు, జిల్లా సంక్షేమ అధికారి స్వచ్ఛంద సంస్థలకు సమాచారం చేరవేయాలని సూచించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. పోటీలకు సంబంధించిన లిఎంట్రీలను 2026 జూన్ 30వ తేదీ లోగా గూగుల్ డ్రైవ్ లింక్ ద్వారా nhrcshort-film@gmail.com కు పంపాలనిలి తెలిపారు. పూర్తి నిబంధనలు మరియు వివరాలు చీఠ=జ అధికారిక వెబ్‌సైట్- లో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదు

**- రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలి**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 13( విజన్ ఆంధ్ర) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం తగదని, రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, ప్యాడీ లోడ్లు వెళ్లినా ఎంట్రీలు నమోదు చేయకపోవడం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో రైతుల వివరాలు, వాహనాల సమాచారం, ధాన్యం రాకపోకల వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ నిర్లక్ష్యంగా నిర్వహించడం తీవ్ర తప్పిదమని పేర్కొన్నారు. కేంద్రంలో ప్యాడీ క్లీనర్ లేకపోవడంపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాడీ శుభ్రపరచకుండా మిల్లులకు పంపితే రైతులకు నష్టం జరుగుతుందని, మిల్లర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. శుభ్రపరిచిన ధాన్యమే మిల్లులకు పంపించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరుపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఓలు కేవలం తేమ శాతం పరిశీలించి వెళ్లిపోవడం సరికాదని, సెంటర్‌లోకి వచ్చే, బయటకు వెళ్లే ధాన్యాన్ని పర్యవేక్షించడం, రిజిస్టర్లు పరిశీలించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పర్యవేక్షణ లోపాలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్యాబ్ ఎంట్రీలు చేయకుండా ధాన్యం తరలించడం వల్ల రైతులకు చెల్లింపుల్లో సమస్యలు వస్తాయన్నారు. ప్రతి లోడ్‌కు వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రంలో మహిళా సంఘ సభ్యులతో మాట్లాడిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ, కేంద్ర నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని కొందరు రైతులు అధిక ధరల కోసం ప్రైవేటుగా ఇతర ప్రాంతాలకు ధాన్యం తరలిస్తున్న విషయాన్ని కూడా సమీక్షించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సమర్థంగా పనిచేస్తే రైతులు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. కొనుగోలు కేంద్రాలు పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, డీఏవో వీరప్ప, తహసిల్దార్ నందిని, ఏఈఓ రోహిత్, తదితరులున్నారు.

# ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి

**- కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు లేకుండా చర్యలు**
**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాలి**



నిర్మల్ జిల్లా, మే 13,(విజన్ ఆంధ్రా); మొక్కజొన్న, వరి ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన ధాన్యం గోదాములకు తరలింపు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతశీ చేయాలనీ ఆదేశించారు. ఇప్పటికే టోల్ ప్లాజాలు, చెక్‌పోస్టుల వద్ద ఖాళీ లారీలను గుర్తించి ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నామని తెలిపారు. అవసరానికి అనుగుణంగా మరిన్ని లారీలు సమకూర్చుకోవాలని సూచించారు. లారీలు సమకూర్చే ప్రాంతాలు, అన్‌లోడింగ్ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ తదితర శాఖల సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం సంచులు నిల్వ ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే స్థానిక కూలీలను హమాలీలుగా నియమించుకోవాలని తెలిపారు. 25 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో అన్‌లోడింగ్ పాయింట్లు ఉన్న కేంద్రాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములు, రైతు వేదికలు తదితర ప్రాంతాల్లో కూడా ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేందుకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాలు, ఇతర తనిఖీ కేంద్రాల్లో తగిన పోలీసు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారులు, మేనేజర్లు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## ధాన్యం బస్తాల దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన



నిజామాబాద్, మే 13 :(విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రానికి సమీపంలో గల ఖానాపూర్ లోని రైస్ మిల్లులను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లక్ష్మీ బాలాజీ రైస్ మిల్లును, శ్రీ సిద్ధి రామేశ్వర ప్రైవేటు లిమిటెడ్ మిల్లులను సందర్శించారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని వివరాలు సేకరించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, రైస్ మిల్లుల నిర్వాహకులు వి. మోహన్ రెడ్డి, శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ఇంటింటి గణనలో ప్రతి ఇల్లు లెక్కించాలి

**- బౌండరీ మ్యాపింగ్ ఖచ్చితంగా పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 13 (విజన్ ఆంధ్ర) : ఇంటింటి గణనలో ప్రతి ఇల్లు లెక్కించాలనీ, బౌండరీ మ్యాపింగ్ ఖచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో బుధవారం కలెక్టర్ జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత సిబ్బందితో నేరుగా మాట్లాడి పనితీరును సమీక్షించారు. ఎన్యుమరేటర్లు తమ పరిధిలోని బౌండరీలు, రోడ్లు, లైన్లు, ఇంటి నంబర్లపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో చెరువులు, రహదారులు, దేవాలయాలు, చర్చిలు, పాఠశాలలు వంటి ప్రాంతాలను కూడా స్పష్టంగా గుర్తించాలని సూచించారు. పెన్సిల్‌తో డాటెడ్ లైన్లు ఉపయోగిస్తూ సరైన మ్యాప్ తయారు చేయాలని తెలిపారు. ఇంటి నంబర్లు సక్రమంగా మార్కింగ్ చేయాలని, ఒకే కప్పు కింద ఉన్న ఇళ్లకు కూడా స్పష్టమైన నంబరింగ్ విధానం పాటించాలని సూచించారు. ఎన్యుమరేటర్ లు తమ బ్లాక్ పరిధిలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు కవర్ చేశారో, జనాభా అంచనాలు, మ్యాప్ పూర్తిస్థాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సూపర్వైజర్లు, చార్జి అధికారులు క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎన్యుమరేటర్లకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిపై పూర్తిగా ఆధారపడకుండా ప్రతి ఎన్యుమరేటర్ తమ పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మ్యాప్ పూర్తయిన వెంటనే దాన్ని పరిశీలించి భద్రపరచాలని, ప్రతి ఇంటికి మార్కర్‌తో నంబర్లు స్పష్టంగా వేయాలని ఆదేశించారు. గణన ప్రక్రియను అత్యంత బాధ్యతగా తీసుకొని ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని, ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ నందిని, సూపర్వైజర్ లు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ను కలిసిన డీఆర్ఓ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్, మే 13 ( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా బి.గీత బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

## సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేత

ఖమ్మం, మే, 13 ( విజన్ ఆంధ్ర ) : రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన జవీ=ఖీ చెక్కులను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన శెట్టి ప్రవీణ్ కుమార్, ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన రామలింగాచారి లు అనారోగ్యం తో చికిత్స పొంది సి.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు మంజూరైన రూ. 1,08,000 ల విలువైన చెక్కులను ఎంపీ రవిచంద్ర వ్యక్తిగత సహాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ బాధితులకు అందజేశారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి

**- పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయండి**
**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా, మే 13,(విజన్ ఆంధ్రా); ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి గ్రామ, పట్టణ ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'విద్యా వారోత్సవాల' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాప్రతినిధుల సమిష్టి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామం, వార్డులోని పాఠశాలలను తరచూ సందర్శిస్తూ మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాలు, విద్యార్థుల హాజరు వంటి అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా పురోగతి సాధించడం సంతోషకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో నిర్మల్ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జిల్లా అధికారులు కలెక్టర్ భవేశ్ మిశ్రాను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, సీపీఓ జీవరత్నం, వివిధ మండలాల ఎంఈఓలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల్ మే 13 (విజన్ ఆంధ్ర) : దివ్యాంగులకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాక వారి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా సమగ్ర శిక్ష, అల్మికో సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు వారి పనులు వాళ్ళు చేసుకునేందుకు వీలుగా ఉపకరణాలు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల తమ పిల్లలకు సహకరించి, బాగా చదివిస్తే దివ్యాంగుల కోటాలో త్వరగా ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన ఉపకరణాల వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ విజయలక్ష్మి, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర్ గౌడ్, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, అల్మికో సంస్థ ప్రతినిధులు సోనీ కుమారి, శోభిత్ ద్వివేది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి సహకరించాలి

**- మెరుగైన పనితీరు కనబరిస్తే సర్పంచులకు అవార్డులు**
**- విద్యా వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 13 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు, బాల్యవివాహాలను నిర్మూలించేందుకు సర్పంచులు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో పాఠశాల విద్యా కార్యక్రమాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందంటే సంబంధిత సర్పంచ్ లకు తప్పకుండా తెలుస్తుందని, బాల్య వివాహాలకు సహకరించిన వారందరికీ చట్టపరంగా శిక్షలు పడతాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలపై పర్యవేక్షణ చేసే బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఉదయం అల్పాహారం కూడా అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మత్తులు చేయడమే కాక మన ఊరు మన బడిలో మంజూరై పెండింగ్ లో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వము విద్యార్థులకు ప్రత్యేక కిట్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మెరుగైన పనితీరు కనబరిచే సర్పంచులకు ప్రతి మండలం నుంచి అయిదుగురు చొప్పున ఆగస్టు 15న అవార్డులు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రకటించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పదో తరగతి ఫలితాల్లో టాపర్స్ గా నిలిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, డిపిఓ శ్రీకాంత్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణలో కెమిస్ట్ల పాత్ర కీలకం

**- అసిస్టెంట్ డైరెక్టర్ బిందు**







నాగోల్,మే12 (విజన్ ఆంధ్ర) : మత్తు రహిత తెలంగాణ లక్ష్య సాధనలో కెమిస్ట్లు కీలక పాత్ర పోషించాలని డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ బిందు పేర్కొన్నారు.నాగోల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు నాగోల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఔషధాల విక్రయంలో పాటించాల్సిన నిబంధనలు, మత్తు పదార్థాల నియంత్రణలో ఫార్మసీ నిర్వాహకుల బాధ్యతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ సరిత, మేడ్చల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ శర్మ, ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ బిందు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం "మత్తు రహిత తెలంగాణ" లక్ష్యంతో డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంలో మెడికల్ షాపుల నిర్వాహకుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అయిన మందులను వైద్యుల సూచన లేకుండా విక్రయించరాదని స్పష్టం చేశారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ సరిత మాట్లాడుతూ ఔషధాల నిల్వ, విక్రయ విధానాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ఫార్మసీ నిర్వాహకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. మేడ్చల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేస్తున్న మార్గదర్శకాలపై ప్రతి కెమిస్ట్కు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల నియంత్రణలో కూడా కెమిస్ట్లు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగోల్ ,మారుతి నగర్ ,నర్సిరెడ్డి, వెంకటేష్ ,శరత్, వేణుగోపాల్ ,స్వామి , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్లోడింగ్లో జాప్యం వద్దు

**- రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు**
**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా, మే 13,(విజన్ ఆంధ్రా); జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావార్ పూర్ టోల్ ప్లాజా, లోకేశ్వరం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన స్వయంగా సందర్శించి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు చేరుకున్న లారీలను 24 గంటల్లోపు తప్పనిసరిగా అన్లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్లు, అక్రమ కోతలు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ధాన్యం దిగుమతిలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే పీపీసీలు, రవాణా విభాగం, రైస్ మిల్లుల మధ్య సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని త్వరితగతిన అన్లోడింగ్ చేసి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సివిల్ సప్లై అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సూర్యరావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**- డీఆర్వో మల్లికార్జునుడు**



కడప, మే 13(విజన్ ఆంధ్ర :) జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మల్లికార్జునుడు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ చాంబర్ నందు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డీఆర్వో మల్లికార్జునుడు.. సంబంధిత శాఖల అధికారులతో జిల్లా పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం.ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి మే 21వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో మొదటి సం. విద్యార్థులకు ఉదయం 9 నుండి 12 వరకు, రెండవ సం. విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 46 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలనీ పోలీస్, రెవిన్యూ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 (బి ఎన్ ఎస్ ఎస్) సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ షాపులను పరీక్ష సమయంలో మూసివేయాలని, కేంద్రాల వద్ద తగిన వైద్య సహాయం అందించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటిని ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ అధికారులకు, అత్యవసర మందులతో పాటు ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకుని ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుటకు తగిన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రాల వద్ద శుభ్రత చర్యలు చేపట్టాలని, సమాధాన పత్రాలు సకాలంలో స్పాట్ వాల్యూషన్ కేంద్రాలకు చేర్చుటకు తగిన పోస్టల్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇన్విజిలేటర్స్ కొరత లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయుటకు సంబంధిత జిల్లా అధికారుల సమన్వయంతో పని చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. పరీక్ష ప్రారంభానికి అర్థ గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులకు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండేలా బస్సులను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక కూడా బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్.టి.సి అధికారులకు ఆదేశించారు.ఆర్.ఐ.ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ పరీక్షలకు 12235 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 8084 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం 20,319 హాజరవుతారన్నారు. విద్యార్థులు సహాయం కొరకు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08562 244171 కు ఫోన్ చేయవచ్చున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారం ఎంతైనా అవసరం అని, అందుకోసం సంబందిత శాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఓ టిఎన్వి వెంకటేశ్వర్లు, కె ఏం సి మేనేజర్ భాస్కర్ గౌడ్, డిప్యూటీ డిఈవో రాజగోపాల్ రెడ్డి, ఆర్ఎంఆర్టిసి ఇన్చార్జ్ రమేష్ బాబు, డిఐఓ ప్రవీణ్ కుమార్, ఏపీఎస్ ఆర్.టి.సి, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, డి ఈసీ పరీక్షల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నర్సుల సంఘం ఆధ్వర్యంలో సేవా సృజన పురస్కారాల ప్రధానం




హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాధ్ ) : అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ గుర్తింపు పొందిన తెలంగాణ నర్సుల సంఘం స్థాపించి విజయ వంతంగా "50 " సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంధర్భంగా, తెలంగాణ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, అది లక్ష్మి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, లలిత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్వర్ణలత, రాష్ట్ర కోశాధికారి నేతృత్వంలో తెలంగాణ నర్సుల సంఘం స్వర్ణోత్సవ వేడుకలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించింది. మంగళవారం సాయంత్రం రవీంద్రభారతి, మొదటి అంతస్తు కాన్ఫరెన్స్ హాల్, సైఫాబాద్ హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఈ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం - 2026, స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా, తెలంగాణ నర్సుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులలో తమ వంతు బాధ్యతగా నిస్వార్ధంగా సేవలందిస్తూ, నర్సింగ్ వృత్తి పట్ల తమ అంకితమైన సేవ, కరుణామయమైన సంరక్షణ, ఆదర్శప్రాయమైన నిబద్ధతకు గుర్తింపుగా ఉన్న మానవతామూర్తులైన సీనియర్ నర్సులను ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేస్తూ, ఆరోగ్యాని అందిస్తూ, ప్రాణాలను కాపాడుతూ, నర్సింగ్ సమాజాన్ని ప్రేరేపించడంలో సీనియర్ నర్సుల కృషి నిజంగా ప్రశంసనీయం అని అభినందిస్తూ పలువురు సీనియర్ నర్సులను ఎంపిక చేసి వారిని "సేవా సృజన పురస్కార్ -2026" పురస్కారాలను మొమెంటో , ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించడం జరిగింది. తెలంగాణ నర్సుల సంఘం ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులలో పనిచేస్తున్న సాధికారత పొందిన సీనియర్ నర్సులకు అలాగే తమ సేవలతో ఆదర్శంగా నిలుస్తున్న సీనియర్ నర్సులు 'రాజరాజేశ్వరి' గ్రేడ్ వన్ నర్సింగ్ హోమ్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్, మధిర, ఖమ్మం డిస్ట్రిక్ట్ , 'జి. శారద' గ్రేడ్ వన్ నర్సింగ్ ఆఫీసర్, ఎ హెచ్, మధిర ఖమ్మం డిస్ట్రిక్ట్ , 'వెలొనిక స్టెల్లా' సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బెల్లంపల్లి మంచిర్యాల్ డిస్ట్రిక్ట్,' కె. రాధా కుమారి' సీనియర్ నర్సింగ్ ఆఫీసర్, డిస్టిక్ హాస్పిటల్, ములుగు డిస్ట్రిక్ట్, ల సేవలను గుర్తించి వారిని "సేవా సృజన పురస్కారాలతో " ఘనంగా సత్కరించి, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు

# మల్కాజ్గిరి సర్కిల్ లో సమయం పాలన కరువు

**- ఇష్టానుసారంగా అధికారులు**
**- డ్యూటీ చేస్తున్నారా...లేదా...?**



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ్ర):మల్కాజ్గిరి జోనల్ పరిధిలోని మల్కాజ్గిరి సర్కిల్ లో అధికారులు సమయం పాలన పాటించడం లేదు. తమ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తారని విమర్శలు వినవస్తున్నాయి. ఎవరైనా పనిమీద వస్తే సంబంధించిన అధికారి కుర్చీలో ఉన్న మాకు తెలవదు అని, సిబ్బంది ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.ఇదే విషయమై ఒక్కోసారి వారి నడుమ వాదనలు తలెత్తుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కార వేదిక.గా ఉండాల్సిన మున్సిపల్ కార్యాలయం అధికారులు వచ్చారో... లేదో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కార్యాల యానికి వెళ్తే కమీషనర్ కనిపించరు. ఇతర ఉన్నతాధికారుల జాడ ఉండదు.ముఖ్యంగా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలలో అధికారులు అస్సలు డ్యూటీ చేస్తున్నారో లీవ్ లో ఉన్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో తమ సమస్యలనువెవరికి చెప్పుకోవాలో తెలియక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఎక్కువ రోజులు వారి కార్యాలయంలోఖాళీ కుర్చీలే దర్శనమిస్తుంటాయి. గత కొద్ది రోజులుగా మున్సిపల్ కార్యాలయంలో అధికారుల గైర్హాజరీ సర్వసాధారణమైపోయింది. వివిధ ధృవీకరణ పత్రాల కోసం వస్తున్న సామాన్య ప్రజలు గంటల తరబడి వేచి చూసి, చివరికి నిరాశతో వెనుదిరుగుతున్నారు. మల్కాజిగిరిలోని వివిధ కాలనీలలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా, వాటిని ఫిర్యాదు చేసేందుకు వెళితే ఖాళీ కుర్చీలు కనిపిస్తు న్నాయని, కనీసం బాధ్యతగా సమాధానం చెప్పే అధికారి కూడా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేము పనులన్నీ మానుకుని మల్కాజిగిరి సర్కిల్ ఆఫీస్ కు వస్తే, ఇక్కడ ఒక్క అధికారి కూడా ఉండరు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలి? సర్కిల్ కార్యాలయం అంటే కేవలం పన్నులు వసూలు చేయడానికేనా? సేవలు అందించడానికి కాదా?! అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# నేడు గురువారం కన్నాయిగూడెం మండలం లో ప్రజా దర్బార్ కార్యక్రమం

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

ములుగు మే 13; విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసు కొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కన్నాయిగూడెం మండల ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ మైదానం లో ఉదయం 8:00 గంటలకు,ముప్పనపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉదయం 10:00 గంటలకు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

# మౌలిక వసతుల కల్పనలో అధికారులు అలసత్వం వహించరాదు

**- మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్**



నిర్మల్, మే 13 (విజన్ ఆంధ్ర) : నిర్మల్ పట్టణంలోని 36వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. కాలానీలో డ్రైనేజీ సమస్యలు, ఇంటి అవసరానికి ఉపయోగించే నీటీ బావులు, వీధి దీపాల పనితీరుపై స్థానికులవద్ద ఆరా తీసారు. మౌలిక సదుపాయాల్లో ఉన్న సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. స్థానికులతో మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు తమ ప్రాంత సమస్యలను వైస్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 36వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బండి లావణ్య ను మున్సిపల్ వైస్ చైర్మన్ పరామర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు చురుకుగా సహకరించాలి


***జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.***



ములుగు మే 13;విజన్ ఆంధ్ర ప్రతినిధి. : 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాలుగా నిలుస్తున్నాయని, విద్యా ప్రమాణాల పెంపుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రభుత్వ విద్యపై ప్రజల్లో అవగాహన పెంచి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 100 శాతానికి చేర్చాలని సూచించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం మన అందరికీ గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ విజయమని పేర్కొన్నారు. డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట, కేజీబీవీ పాఠశాలలు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో లైబ్రరీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ చంద్రకళ, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వైభవం ఉత్సవాలకు బ్రహ్మానందం స్థాయిలో ఏర్పాట్లు...

**- ఉత్సవాల్లో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలి...**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



ములుగు మే 13;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లాలో ఈ నెల 20 నుంచి 22 వరకు నిర్వహించనున్న "ములుగు సాంస్కృతిక వైభవం" ఉత్సవాలను బ్రహ్మానందంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనదలచిన జిల్లా ప్రజలు, కళాకారులు, క్రీడాకారులు, విద్యార్థులు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉత్సవాల విజయవంత నిర్వహణ కోసం విస్తృత ప్రచారం చేపట్టాలని, సోషల్ మీడియా సహా అన్ని సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్రీడల విభాగంలో వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనుండగా, సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో రంగోలి పోటీలు, ఫుడ్ స్టాళ్లు, మెహందీ పోటీలు, హెయిర్ స్టైల్ పోటీలు, టగ్ ఆఫ్ వార్, గిరిజన నృత్య ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా "ములుగు అభివృద్ధి", "ప్లాస్టిక్ రహిత ములుగు", "డ్రగ్స్ రహిత ములుగు" అనే అంశాలపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి అంశంపై గరిష్టంగా ఐదు టీమ్లకు అవకాశం ఉండగా, ఒక్కో టీమ్లో ముగ్గురు సభ్యులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు, మహిళలు, కళాకారులు, విద్యార్థులు, క్రీడాకారులు మే 13 నుంచి 18, 2026 వరకు తమ వివరాలను ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ విధానంలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్ నమోదు కోసం జుణ రాజ కార్పొరేషన్ అధికారి ధర్మ నాయక్ (7032153610) లేదా డివైఎస్ఓ రామ్మోహన్ (7207503775) ఈ నంబర్లకు వాట్సాప్ ద్వారా తమ వివరాలు ఆన్లైన్ నమోదు చేసుకోవచ్చు అన్నారు.

(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము)
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ టి.జి. లిమిటెడ్. ఆపరేషన్ బంజారా హిల్స్ సర్కిల్
టెండర్ నోటీస్.02/2026-27 (పేపర్ నోటిఫికేషన్)
టిజిఎస్పిడిసిఎల్ టెండర్లను ఆహ్వానించదలచుచున్నది మరియు అనుభవం ఉన్న వివిధ కాంట్రాక్టర్ల నుండి ఈ క్రింది పనుల కొరకు సీల్డ్ బిడ్లను ఆహ్వానించడమైనది: (1) హైదరాబాద్, జూబ్లీ హిల్స్లోని జిల్లా బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్న మరియు కొత్త గాల్వాల్యూమ్ ట్రెపెజాయిడల్ ప్రొఫైల్ రూఫింగ్ షీట్లు మరియు ప్యానెల్లను అమర్చి, 3 డిజి సెట్లను తరలించడం (2&3) సిబిడి గ్రీన్ల్యాండ్స్లో లైన్ ఏబి స్విచ్ల రెక్టిఫికేషన్ (4) సిబిడి గ్రీన్ల్యాండ్స్లో 11కెవి ఫీడర్లపై రెక్టిఫికేషన్ పనులు (5&7) ఎస్ఆర్ నగర్లో 315కెవిఏ డిటిఆర్ ఏర్పాటు (6) మోతీనగర్లో ఉన్న పబ్లిక్ డిటిఆర్లపై 3 అదనపు సర్క్యూట్లు (8) బేగంపేట్లో పాత, పాడైన ప్లింత్ల స్థానంలో కొత్త ప్లింత్ ఏర్పాటు. పూర్తి వివరాల కోసం, దయచేసి www.tgsouthernpower.orgని సందర్శించండి.
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, బంజారా హిల్స్ సర్కిల్
DIPR RO NO.2356-PP/CL/ADVT/2026-27 తేదీ 13-05-2026

# ఘన వ్యర్థ పదార్థాల నియమాలు అమలు చేయాలి

***కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అదనపు సంచాలకులు డా. అమిత్ లవ్ సూచన***



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 13 (విజన్ ఆంధ్ర) : ఘన వ్యర్థ పదార్థాల నియమము 2026ను దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అదనపు సంచాలకులు డా. అమిత్ లవ్ సూచించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఘన వ్యర్థ పదార్థాల నియమము-2026 అమలు విషయంలో జిల్లా కలెక్టర్లు, లోకల్ బాడీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారుల బాధ్యతల పై పలు సూచనలు చేశారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రోజు సేకరిస్తున్న ఘన వ్యర్థ పదార్థాల్లో మనుషులు ముట్టుకోలేనివి, ప్రమాదకరమైన పదార్థాలు సైతం కలిసి ఉంటున్నాయని, వాటిని వేరు చేయడం లేదా నాశనం చేయడంలో పారిశుధ్య కార్మికులకు అనారోగ్యాలు, కొన్నిసార్లు అనుకోని ప్రమాదాలు సైతం అభవిస్తుంటాయని వీటిని దృష్టిలో ఉంచుకొని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం పాత 2016 నిబంధనల స్తానంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఏప్రిల్ 1, 2026 నుండి కొత్త కఠినమైన నియమాలు అమలులోకి తెచ్చిందని తెలిపారు. నియమాలను, పర్యవేక్షణ విధానాలను పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నియమాల ప్రకారం ఘన వ్యర్థ పదార్థాలను ఇంటి నుంచి లేదా సంస్థల నుండి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శ్యానిటరి వ్యర్థాలు, ప్రత్యేక జాగ్రత్తలు అవసరమైన వ్యర్థాలు (4) రకాలుగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సి ఉంటుంది. స్వీకరించిన వ్యర్థాలను కొన్నింటిని సేంద్రీయ ఎరువులుగా మరికొన్ని రీసైక్లింగ్, మిగతా వాటిని నాశనం చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ప్రణాళికలు క్షేత్రస్థాయిలో చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ మరియు వంద శాతం పర్యవేక్షణ బాధ్యత స్థానిక సంస్థలదే అని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మూడు అంచెల శిక్షలు అమలుచేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జడ్పీ సీఈవో యాదయ్య, పి డి ఆర్ డి ఓ ఉమాదేవి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి రఘునాథ్ రెడ్డి, అడిషనల్ డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సింగోటం - గోపాలదిన్నె లింక్ కెనాల్‌పనులు వేగవంతం చేయాలి

**- బొల్లారంలో భూబాధిత రైతులతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖి**
**- భూ సేకరణకు రైతులు సహకరించాలి**
**- కెనాల్ లో భూములు కోల్పోతున్న రైతులకు మూడింతల పరిహారం**
**- పట్టా ఉన్న అసైన్డ్ భూములతో పాటు పట్టా లేని రైతులకు కూడా పరిహారం**
**- సత్వరమే పరిహారం చెల్లించి పనులు మొదలయ్యేలా చూడాలి**
**- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 13 (విజన్ ఆంధ్ర) : సింగోటం-గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని రైతు వేదిక వద్ద సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూబాధిత రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై, వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎకరాకు రూ.11.50 లక్షల పరిహారం**

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మార్కెట్ విలువ రూ. 1,87,500 తక్కువగా ఉందంటూ రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. బేసిక్ మార్కెట్ విలువను తక్షణమే రెండింతలు పెంచి రూ. 3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన విలువ (రూ. 3,75,000) ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు, గెజిట్ ప్రచురించిన నాటి నుంచి వడ్డీని కూడా కలిపి ఎకరాకు మొత్తం రూ. 11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తక్షణమే అవార్డు కాపీలు మంజూరు చేసి పరిహార పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యాన్ని మంత్రి ఆదేశించారు.

**అసైన్డ్, పట్టా లేని రైతులకూ సమన్యాయం**

సాధారణ పట్టాదారులతో పాటే అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా ఇదే తరహా పరిహారాన్ని వర్తింపజేయాలని బొల్లారం గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. అసైన్డ్ పట్టాదారులకు సమాన పరిహారం అందించడంతో పాటు, ఎలాంటి పట్టాలు లేకుండా చాలా కాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని ట్రిపుల్ ఆర్ ('3ఆర్) ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**40 వేల ఎకరాలకు సాగునీరు**

కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు పరిధిలో 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు.. మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి జూపల్లి వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికే 2018లో సింగోటం-గోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. ఈ కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు.

**భూసేకరణ వివరాలు:**

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి: 50 ఎకరాలు వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం: 73 ఎకరాల 13 గుంటలు వల్లభాపూర్: 87 ఎకరాల 3 గుంటలు సంగినేనిపల్లి: 94 ఎకరాల 8 గుంటలు ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బొల్లారం, తూముకుంట సర్పంచులు సుదర్శన్ రెడ్డి, రామన్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు కట్టుదిట్టమైన భద్రత

**- చెక్ పోస్టులు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..**
**- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు**
**- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**





వనపర్తి జిల్లా ప్రతినిధి, మే-13 విజన్ ఆంధ్ర : బక్రీద్ పండుగను రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా శాంతియుతంగా, పరస్పర గౌరవ భావంతో నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి అప్రమత్తంగా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు . సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, విద్వేషపూరిత సందేశాలపై వెంటనే స్పందించాలి. ప్రజల భద్రత, సామరస్య పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మే 27న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణపై రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర డిజిపి సీవీ, ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి దృశ్య సమీక్ష సమావేశంలో ఆయన భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా పోలీసు అధికారులతో కలిసి పాల్గొని, జిల్లాలో బక్రీద్ సందర్భంగా చేపడుతున్న భద్రతా చర్యలు, ప్రత్యేక బందోబస్తు ప్రణాళికలు, చెక్‌పోస్టుల పర్యవేక్షణ, పోలీస్ బృందాల మోహరింపు తదితర అంశాలను డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డిజీపీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీస్ పికెటింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు, రాత్రి గస్తీ, డ్రోన్ మరియు సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణ పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న డీజీపీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకుండా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు ఈ సమావేశంలో వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ, బాలాజీ నాయక్, వనపర్తి జిల్లా వెటర్నరీ అధికారి వెంకటయ్య గౌడ్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ శ్రీ రాంబాబు,మున్సిపల్ స్టాంట్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై, రామేశ్వర్ రెడ్డి అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లుల వద్ద ధాన్యం అన్లోడ్ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 13 (విజన్ ఆంధ్ర) : వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగాలని, లారీలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండడానికి వీల్లేదని, ప్రత్యేక అధికారులు మిల్లుల వద్ద ఉండి వరి ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోళ్లు, మిల్లుల వద్ద అన్లోడింగ్ పై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వానికి వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నిర్వహించడమే ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఈ విషయంలో క్షేత్ర స్థాయిలో ఏవిధమైన స్థాయిలో అలసత్వం వహించినా సహించేది లేదన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మిల్లు వద్ద తప్పనిసరిగా ఒక ప్రత్యేక అధికారి ఉండి ధాన్యం అన్లోడ్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. లారీలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండడానికి వీల్లేదని, ప్రత్యేక అధికారులు మిల్లుల వద్ద ఉండి వరి ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేయించాలని, లారీలను వేచి ఉండేలా చేస్తే చర్యలు తప్పవన్నారు. పలు మండలాల్లో మిల్లుల వద్ద లారీలు ఎక్కువ మొత్తంలో వేచి ఉన్నట్లు సమాచారం అందుతుందని త్వరగా అన్లోడ్ చేయించాలని సూచించారు. తహసీల్దార్లు, పోలీస్ అధికారులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో చొరవ తీసుకొని ఎక్కడ ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు తరుగు పేరిట తొలగించడానికి ఆస్కారం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యంలో తాలు తొలగించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేగంగా కొనుగోలు పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తిన ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను కూడా అవసరమైనన్ని లారీలను అందుబాటులో ఉంచమని సూచించాలని, ఏ విధమైన సమస్యలు రాకుండా చూడాలని, లారీల విషయంలో కొరత కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా మండలాల్లో తాసిల్దార్లు అదనంగా హమాలీలను కూడా రప్పించి మిల్లుల వద్ద అన్లోడ్ విషయంలో చొరవ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డి సి ఓ రాణి, డిటిఓ మానస, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ సందర్భముగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డిజిపి సి.వి. ఆనంద్

**- జిల్లా నుండి పాల్గొన్న జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల మే 13 (విజన్ ఆంధ్ర) : రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, సామాజిక సామరస్య వాతావరణం నెలకొల్పే అంశాలపై తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) శ్రీ సి.వి. ఆనంద్ బుధవారం జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, జిల్లాల నుండి ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా నుండి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పాల్గొని జిల్లాలో తీసుకున్న చర్యల గురించి తెలియజేశారు. . ఈ సందర్భంగా డిజిపి సి.వి. ఆనంద్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈద్గాలు, మసీదులు, ప్రార్థనా స్థలాలు, మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.సామాజిక మాధ్యమాల ద్వారా ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డిజిపి స్పష్టం చేశారు. అనుమానాస్పద సమాచారం గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణం నెలకొల్పాలని, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. అన్ని చెక్‌పోస్టులలో 24/7 పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పండుగ విధుల్లో పాల్గొనే సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ వై. మొగిలయ్య, అలంపూర్ గద్వాల సర్కిల్ అధికారులు, రెవెన్యూ, వెటర్నరీ, మున్సిపల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగోనిపల్లి ప్యాడీ కొనుగోలు కేంద్రంలో నిర్లక్ష్యం

**- అధికారులపై ఆగ్రహం..**
**- బాధ్యులను సస్పెండ్ చేయాలని ఆదేశాలు**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 13 (విజన్ ఆంధ్ర) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత అధికారుల నిర్లక్ష్యం తగదని, అలసత్వం చూపే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాల మండలం తెలుగోనిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో ఇంచార్జ్ గైర్హాజరు కావడం, మహిళా సంఘాల సభ్యులు లేకపోవడం, రైతులు ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తూకాలు, లిఫ్టింగ్ పనులు సరైన పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్నాయని గమనించిన కలెక్టర్ రైతులకు ఇబ్బందులు కలిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలో ఐకేపీ మహిళా సంఘాల స్థానంలో ఇతరులు వ్యవహారాలు నిర్వహించడం గమనించి తీవ్రంగా మందలించారు. మహిళా సంఘాల సభ్యులే కొనుగోలు కేంద్రంలో నిర్వహించాలని స్పష్టం చేశారు. రిజిస్టర్ లు, ఇతర రికార్డులను 15 రోజులుగా సరిగ్గా నమోదు చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో సరైన నిర్వహణ లేకపోవడం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా భావించిన కలెక్టర్ బాధ్యులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రొక్యూర్మెంట్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పౌరసరఫల శాఖ మేనేజర్ విమల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**- ఐ.టి.డి.ఏ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో.**



ములుగు మే 13; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణ, వసతి కల్పించనున్నట్లు ఏటూరునాగారం ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో యూత్ ట్రైనింగ్ సెంటర్స్ ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ సెక్టార్ ట్రైనింగ్ ఏజెన్సీల ద్వారా సుమారు 75 రోజుల నుండి 178 రోజుల వరకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని,శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని పేర్కొన్నారు. ఏటూరునాగారం కేంద్రం లో సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, ఎంబ్రాయిడరీ మెషిన్ ఆపరేటర్, బ్యూటీ థెరపిస్ట్, హెయిర్ డ్రెస్సర్. వరంగల్ కేంద్రంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వేర్ హౌస్ సూపర్ విజన్, ఆప్టికల్ ఫైబర్ టెక్నీషియన్, ఇరిగేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ. కాటారం కేంద్రంలో ఫుడ్ & బెవరేజ్ సర్వీస్, సోలార్ పంప్ టెక్నీషియన్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ (ఏసీ), డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అంశాలలో ఉచిత వసతి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులు తమ విద్యార్హత జిరాక్స్ పత్రాలతో ఏటూరునాగారంలోని ఐ.టి.డి.ఏ కార్యాలయంలో 19 మే 2026 తేది వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని,మరింత సమాచారం సెల్ ఫోన్ నెంబర్లను 9490341911, 8008932159, 7981633716 సంప్రదించాలని అన్నారు.

# నేత్రపర్వంగా 'హైందవీయం' కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శన



హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రఖ్యాత కూచిపూడి నృత్య శిక్షణా సంస్థ "త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్" 17వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రముఖ రచయిత, కళారత్న 'బ్నిమ్' వ్రాసిన, సంగీత కళాకారుడు 'డి ఎస్వీ శాస్త్రి' సంగీతం వహించిన, నాట్య గురువు, త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, కార్యక్రమ నిర్వాహకురాలు 'ఇందిరా పరాశరం' కొరియోగ్రఫీ చేసి తన 80 మంది శిష్యులతో కలిసి నేత్రపర్వంగా ప్రదర్శించిన స్వధర్మే నిధానం శ్రేయః " హైందవీయం " కూచిపూడి డ్యాన్స్ బ్యాలెట్ ఆహుతులను విశేషంగా అలరించింది, ఆకట్టుకుంది. మంగళవారంనాడు రవీంద్ర భారతి ఆడిటోరియం, సైఫాబాద్, హైదరాబాద్ వేదికగా నిర్వహించిన అద్భుతమైన ఈ కూచిపూడి నృత్యరూపకం " హైందవీయం" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, గౌరవ అతిథులుగా కళారత్న డాక్టర్ . చింతా రవి బాలక్రిష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ సి టి ఒ , ప్రవణ గ్రూప్ డాక్టర్. రాంబాబు బూరుగు, డైరెక్టర్, ఎడ్యుకేషన్ సిల్వర్ ఓక్ ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్ డైరెక్టర్ సీతా మూర్తి, ప్రత్యేక అతిథులుగా మిస్టర్ మచ్చా దినేష్ బాబు ప్రాంతీయ డైరెక్టర్, దక్షిణ భారతదేశం, అసోచామ్, ముదుంబై మాధవ్ త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ సలహాదారు, త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సీతారామా చార్యులు హాజరై ఇందిరా పరాశరం తన శిష్యులతో కలిసి కన్నుల పండుగగా ప్రదర్శించి ప్రేక్షకులను మంత్ర ముద్దులను చేసిన శిష్యులను, గురువు ఇందిరా పరాశరం ని ప్రశంసించి మొమెంటోలను ప్రశంశా పత్రాలను అందజేసి అభినందించి తమ శుభాకాంక్షలు తెలిపారు. అద్భుతమైన హైందవీయం నృత్య రూపకంలో మానవ సృష్టి దగ్గర్నుంచి స్వాతంత్ర పోరాటం వరకు హైందవ ధర్మాన్ని ఎలా పరిరక్షించారని కన్నులకు కట్టేవిధంగా ప్రదర్శించి కనువిందు చేసిన కార్యక్రమంలో తమను కూడా భాగస్వాములను చేసి తిలకించే భాగ్యాన్ని కల్పించిన నిర్వాహకురాలు ఇందిరా పరాశరం కి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ చక్కటి వ్యాఖ్యానాన్ని ముదుంబై మాధవ్ అందించారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..

**- రైతులు ఆందోళన చెందవద్దు**
**- అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**
**- వెలిచాల ధాన్యం కొనుగోలు సందర్శన**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 13.ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న అని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామడుగు మండలం వెలిచాల గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘం పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు వేగవంతమైన సేవలు అందించా లని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, మిల్లులకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నర్సింగరావు, రామడుగు తహసీల్దార్ రాజేశ్వరి, సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# జనగణనలో ఇండ్ల గణన పకడ్బందీగా నిర్వహించాలి

### న్యూ శాయంపేటలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ:జిల్లా ప్రతినిధి. మే 13 ( విజన్ ఆంధ్ర ): జనగణన2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన, హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.?హన్మకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట ప్రాంతంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గణన ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల ప్రణాళిక రూపకల్పనలో జనగణన గణాంకాలు కీలకమని తెలిపారు. హౌస్ లిస్టింగ్‌లో ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల వివరాలు, ప్రాథమిక వసతులు తదితర అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఎలాంటి అపోహలకు తావులేకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం కూడా గణనలో మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహనతో పనిచేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సంతోష్, ఆర్ ఐ కృష్ణ రావు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిలర్ల తో సమీక్షా సమీవేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణ రావు

భూపాలపల్లి జిల్లా మే 13 ( విజన్ ఆంధ్ర ) కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం, మక్కలు కొనుగోలుపై రెవిన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్ రవాణ, డిఆర్డిఓ, సహకార, పంచాయతీరాజ్, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వకపోవడం పట్ల రైతుల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 30 రోజులు దాన్యం, మక్కల కొనుగోలులో చాలా ప్రతిష్టాత్మమని ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో మాట్లాడుకున్నది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన తదుపరి రైతుకి ఏమి సంబంధమని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, దాని వల్ల రైతుల ఇబ్బందులకు గురి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఫల్యం జరుగుతుందని అందుకు ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో వరి కోత యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాలు, తరుగులు తీయొద్దని మిల్లర్లుకు పలుమార్లు




చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం కానీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన తదుపరి కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, మిల్లర్లదే బాధ్యతని కాంటా అయ్యేంత వరకు మాత్రమే రైతు బాధ్యతని తెలిపారు. అకాల వర్షాలకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులను ఎందుకు ఇబ్బందులు గురి చేస్తున్నారని అని ప్రశ్నించారు. ఇది రైతు చేసిన పాపమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాము, రవాణా, కాంటా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ. రవాణాలో ఇబ్బందులు కల్పిస్తే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రవాణాలో ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు. రైతులకు 48 గంటల్లో నగదు జమ చేసేందుకు కొనుగోలు జరిగిన వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లులు వద్ద దాన్యం దిగుమతి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రమణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వైద్య విధానాలతో న్యూరో,ఫిట్స్ వ్యాధులకు మెరుగైన చికిత్స

- యశోద హాస్పిటల్ న్యూరో ఫిజీషియాన్ వైద్యులు సాయి సతీష్
- యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 13, (విజన్ ఆంధ్ర ) : న్యూరో సంబంధిత వ్యాధులు, ఫిట్స్ సమస్యల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని యశోద హాస్పిటల్ ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్ కె అన్నారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో అంకం మల్లేష్ మేనేజర్ నిర్వహణలో బుధవారం మంచిర్యాలలోని ఓ ప్రముఖ హోటల్‌లో న్యూరో, ఫిట్స్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్ల కారణంగా న్యూరో సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. తలనొప్పి, మతిమరుపు, చేతులుకాళ్లలో బలహీనత, తల తిరగడం, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఫిట్స్ సమస్య వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే థ్రాంబోలైసిస్ ప్రక్రియను స్ట్రోక్ సంభవించిన 4నుండి 5 గంటలలోపు తప్పనిసరిగా నిర్వహించాలని ఆధునిక వైద్య విధానాలతో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఫిట్స్‌ను మూఢనమ్మకాలతో అనుసంధానం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. వైద్య పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే సాధారణ జీవితం గడపవచ్చన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా న్యూరో సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎలా చేయాలి, ఫిట్స్ వచ్చిన వ్యక్తిని ఎలా సంరక్షించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలపై వైద్యులు వివరించారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు.

# ఖచ్చితమైన జనగణనతోనే అభివృద్ధికి బలమైన పునాది

### జనగణన2027 అవగాహన ర్యాలీలో ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ: జిల్లా ప్రతినిధి మే 13 ( విజన్ ఆంధ్ర ) : జనగణన2027లో ప్రతి పౌరుడు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించేందుకు బుధవారం హనుమకొండ నగరంలో భారీ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహన ర్యాలీ హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సర్కిల్ నుంచి ప్రారంభమై భీమారం సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ మొత్తం దేశాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, ఖచ్చితమైన సమాచారం ప్రాముఖ్యతను తెలియజేసే నినాదాలతో ఆకట్టుకుంది. ర్యాలీ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి, "జనగణన2027లో తప్పనిసరిగా పాల్గొని, మా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకుని దేశ అభివృద్ధికి సహకరిస్తాం" అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, జనగణన కేవలం లెక్కల




ప్రక్రియ మాత్రమే కాకుండా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అని తెలిపారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహించడం ప్రభుత్వాల ముఖ్యమైన బాధ్యత అని తెలిపారు. ప్రజల జీవన పరిస్థితులు, అవసరాలు, అభివృద్ధి సూచికలను అంచనా వేయడంలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా ఆలస్యమైన జనగణన ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అమలు చేస్తోందన్నారు. ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని సరైన సమాచారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, జనగణన దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ అని అన్నారు. హౌస్ లిస్టింగ్‌లో ఇంటికి సంబంధించిన దాదాపు 30 అంశాలపై వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఇంటి పైకప్పు, ఫ్లోరింగ్, మరుగుదొడ్డి, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, కంప్యూటర్, మొబైల్ ఫోన్ వంటి వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించి సరైన సమాచారం ఇవ్వాలని కోరారు. సరైన జనాభా లెక్కల ఆధారంగానే వచ్చే పది సంవత్సరాల ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు రూపొందించబడతాయని పేర్కొన్నారు. ఇంటింటికీ వచ్చే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల వద్ద అధికారిక గుర్తింపు కార్డులు ఉంటాయని, ప్రజలు నమ్మకంతో వివరాలు అందించాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసిన వారు తమ ఐడీని ఎన్యూమరేటర్‌కు తెలియజేయాలని, దీంతో డేటా వెరిఫికేషన్ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. జనగణన విజయవంతం కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ ర్యాలీలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఉప కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, సమ్మయ్య, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, బల్దియా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, మెప్మా సభ్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తాం...

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 13,(విజన్ ఆంధ్ర ) : ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో టామ్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, టామ్ కామ్ సంస్థ మేనేజర్ అనిల్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సరైన విద్య, నైపుణ్యత కలిగిన వారికి విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సరైన అర్హత కలిగిన వారికి ఆయా దేశాల భాష నేర్పించి ఉపాధి కల్పించడంలో టామ్ కామ్ సంస్థ మంచి పని చేస్తుందని తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్ దేశాలతో పాటు గ్రీస్, యూరోప్ వంటి దేశాలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యత, అనుభవం కలిగిన వారి కొరకు ఆయా దేశాలు సంప్రదిస్తున్నాయని తెలిపారు. అర్హత, నైపుణ్యత గల వారికి ఆయా దేశాలలో వారానికి 35 గంటల పని ఉంటుందని, దాదాపు 2 లక్షల రూపాయల వరకు వేతనం వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో యువతకు ఉపాధి కల్పించడంలో మందమర్రి ప్రాంతంలో శిక్షణ కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందని, జూన్ 10వ తేదీ నుండి ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక శిక్షణా సంస్థ, సింగరేణి సంస్థల ద్వారా అనేక మంది శిక్షణ పొంది, అప్రెంటిస్ పూర్తి చేసి అనుభవం పొందుతున్నారని, ఏకాగ్రతతో విదేశీ భాషను నేర్చుకొని విదేశాలలో పనిచేసే అవకాశం సంపాదించుకోవాలని తెలిపారు. యువత తమ వివరాలను నమోదు చేసుకొని శిక్షణ పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పని చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్లాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాలలో ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించడం జరుగుతుందని, ఆయా దేశాలలో సాంఘిక భద్రత, కార్మిక చట్టాల ద్వారా కార్మికులకు సంతృప్తికరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. వారానికి 35 గంటల పని ఉంటుందని, నిబంధనల ప్రకారం నైపుణ్యత, అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా దేశాలకు సంబంధించి అర్హత గల అభ్యర్థులు ఆ దేశాల భాష నేర్చుకోవాలని, సాంకేతిక నైపుణ్యత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానిక యువతకు మందమర్రి మండలంలో అందుబాటులో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# సహాయ ఉపకరణాలు అందించడంలో అలింకో సంస్థ సహకారం అభినందనీయం

- జిల్లా కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 13, 2026: విజన్ ఆంధ్ర : జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సహాయ ఉపకరణాలు అందించడంలో అలింకో సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఈ జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సహాయ ఉపకరణాలు అందించడానికి అలింకో సంస్థ సహకారం అభినందనీయమని అన్నారు. గత 2 నెలల క్రింద జనకాపూర్ లో భవిత కేంద్రంలో సందర్శించినప్పుడు పిల్లల తల్లిదండ్రులు ఉపకరణాల అవసరాన్ని తన దృష్టికి తీసుకురావడంతో ఈ విషయమై అలింకో సంస్థ వారిని సంప్రదించడం జరిగిందని, దాదాపు 22 లక్షల రూపాయలతో 184 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు సంస్థ వారు ముందుకు వచ్చారని తెలిపారు. మనం దివ్యాంగ పిల్లలపై జాలి మాత్రమే చూపించకుండా వారికి సమాజంలో మనతో సమానంగా జీవించేందుకు మనోధైర్యాన్ని కల్పించాలని తెలిపారు. దివ్యాంగులు ఎన్నో రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. పిల్లలకు పంపిణీ చేసిన సహాయ ఉపకరణాలను ఉపయోగించుకోవాలని, ఏవైనా సమస్యలు వస్తే అలింకో సంస్థను సంప్రదించాలని తెలిపారు. శారీరక, మానసిక దివ్యాంగత్వం, వినికిడి లోపం, అంధత్వంతో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన ఉపకరణాలు వీల్ చైర్లు, చంక కర్రలు, ట్రై సైకిల్లు, కోలెటర్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ ప్లేట్లు, ఎమ్మార్ కిట్లు, కృత్రిమ అవయవాల వంటి ఉపకరణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యమును కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలి...

- .జిల్లా కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 13, 2026: విజన్ ఆంధ్ర : రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులను నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించి అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, మాయిశ్చర్, పాడీ క్లీనర్ లను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఐకెపి, పి ఏ సి ల ద్వారా కొనుగోలు కేంద్రాలలో దాన్యం కొనుగోలు జరుగుతుందని, ఆసిఫాబాద్ డివిజన్ లో ఐకెపి ద్వారా 6 కేంద్రాలు, కాగజ్ నగర్ డివిజన్ లో 15 ఐకెపి కేంద్రాలు, 19 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 149 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ప్రతి కేంద్రానికి మండల వ్యవసాయ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాలతో ధాన్యం దెబ్బతినకుండా కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో లారీలు, హమాలీల కొరత లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలో సందీప్ అనే కౌలు రైతు ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేయాలని అధికారులను కోరగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కొరకు అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించడం జరిగిందని, రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల వద్దకు చేరుకొని విక్రయించాలని సూచించారు. రైతులు ఎలాంటి సందేహం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 3 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని కాగజ్ నగర్, కౌటాల, జైనూర్ లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. మొక్కజొన్న పంట ఉత్పత్తిని గోనె సంచులలో తీసుకువచ్చినట్లయితే సంబంధిత చెల్లింపులు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

# గండి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా ,శ్రీధర్ చెరుకూరి

వేంపల్లి, మే 13 (విజన్ ఆంధ్ర) చక్రాయిపేట మండలంలోని గండి శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు అత్యంత వైభవంగా పూర్తయిన నేపథ్యంలో ఆలయాన్ని బుధవారం ఉదయం సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సందర్శించారు జిల్లా కలెక్టర్ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అనంతరం స్వామివారి దర్శనం, ప్రత్యేక అర్చనలు, ఆలయ సత్కారం చేసి జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు ఆలయ ప్రధానార్చకులు అందజేశారు ముందుగా ఆలయ



ప్రాంగణంలో.జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ఆశీర్వాదాలు అందించి, గౌరవ పూర్వకంగా దేశవస్థాన కండువా, పూలమాల వేసి ప్రధాన ఆలయంలో పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర్ భారతి స్వామీజీ ప్రత్యేక అర్చనలు చేయించి పుష్పగిరి పీఠాధిపతి విద్య శంకర్ భారతి స్వామీజి ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం.. దేవస్థాన చరిత్ర, ప్రాశస్త్యాన్ని జిల్లా కలెక్టర్ కు వివరించిన ఆలయ ప్రధాన అర్చకులు వివరించారు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట హాజరైన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శంకర్ బాలాజీ, డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, ఆలయ చైర్మన్ కల్లూరి వెంకట స్వామి, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

## బక్రీద్ వరకు పూర్తి నిషేధం

### - చర్ల సీఐ ఏ. రాజు వర్మ

చర్ల, మే13 (విజన్ ఆంధ్ర): మండలంలో పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఏ. రాజు వర్మ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది, అధికారుల సమన్వయ సమావేశం మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పశుసంవర్ధక శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు మరియు పశువుల వ్యాపారులతో సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన పలు కీలక సూచనలు చేశారు, బక్రీద్ పండుగ ముగిసే వరకు మండలంలో ఎక్కడి నుంచైనా పశువులను తరలించడం పూర్తిగా చట్టవిరుద్ధం అని పండుగ తర్వాత కూడా పశువుల వేలంపాట నిబంధనల ప్రకారం, సరైన పత్రాలు ఉన్నప్పుడే రవాణాకు అనుమతి ఉంటుందని, అక్రమ క్రయవిక్రయాలను అరికట్టడంలో పశు సంవర్ధక శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు అక్రమ రవాణాను అడ్డుకునే పేరుతో ఎవరైనా వ్యక్తులు గానీ, సంఘాలు గానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే వారిపై కఠినమైన శిక్షలు ఉంటాయని సీఐ స్పష్టం చేశారు, ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలే తప్ప, స్వయంగా దాడులకు పాల్పడకూడదని హితవు పలికారు, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలి,నిబంధనలు ఉల్లంఘించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదు అంటూ సిఐ రాజు వర్మ తెలియజేశారు ఈ సమావేశంలో ఎస్సైలు ఆర్.



నర్సిరెడ్డి, పి. కేశవ్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తోకల సురేష్, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ కే. సుధారాణి, అసిస్టెంట్ హరికాంత్ మరియు పశువుల వ్యాపారులు పాల్గొన్నారు.

# కాటారం ఆర్డీఓ గా భాద్యతలు స్వీకరించిన రవీందర్



భూపాలపల్లి జిల్లా మే 13 (విజన్ ఆంధ్ర ) కాటారం ఆర్డిఓ బాధ్యతలు స్వీకరించిన డి రవీందర్ బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆర్డిఓ రవీందర్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఆర్డిఓ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు ప్రజలకు సేవలు అందించేందుకు విధులు నిర్వహిస్తానని తెలిపారు.

# మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ మే13:(విజన్ ఆంధ్ర) పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాదు లోని ఆయన నివాసంలో నిజామాబాద్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. రవీందర్ రెడ్డి, జె. ప్రసాద్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

# సారంగాపూర్ మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా, మే 13 (విజన్ ఆంధ్ర); మార్కెట్ యార్డ్ లో ఎక్కడికక్కడే కుప్పలుగా పేరుకుపోయిన మొక్కజొన్న రాశులను చూసి ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతులకు కావలసిన గోనే సంచులను, ట్రాన్స్ పోర్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనలో అన్నదాతలు పడుతున్న అరిగోసలను చూసి అధికారులను , ప్రభుత్వాన్ని నిలదీశారు.

# గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

### - నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్ :మే 13:విజన్ ఆంధ్ర : గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆమె తెలిపారు. రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ ఆదేశాల మేరకు, జిల్లా సరిహద్దుల్లో పోలీసు బందోబస్తును పటిష్టం చేశారు. చెక్‌పోస్టుల వద్ద, ప్రధాన రహదారులలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తతతో వ్యవహరించాలని, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గోవుల రక్షణకు అన్ని విధాలా కృషి చేస్తామని, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రజల సహకారం కూడా కోరుతున్నామని ఎస్పీ తెలిపారు.

# నేరేడ్ మెట్ లో నేపాలి పనిమనుషులపై తనిఖీలు,ఇళ్ల యజమానులకు అవగాహన



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ్ర): నేపాలి పని మనుషులు నగరంలో దొంగతనాలు చేస్తున్న సంఘటనలు వరుసగా చోటు చేసుకోవడంతో నేరేడ్ మెట్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా నేరేడ్ మెట్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బుధవారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాయుపురి, డిఫెన్స్ కాలనీ, సాయినాథ పురం, చంద్రగిరి కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, ఆర్కే పురం కాలనీలలో నేరేడ్మెట్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నేపాలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్లకు, వెల్ఫేర్ అసోసియేషన్ కి మేడ్ సర్వెంట్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. నేరేడ్ మెట్ ప్రజలందరూ వాచ్మెన్, మేడ్ సర్వెంట్ పనిలో పెట్టుకునే ముందు, వారి పూర్తి వివరాలు, ఆధారాలను సేకరించి, గత చరిత్రను తనిఖీ చేసిన తర్వాతనే పనిలో పెట్టుకోవాలన్నారు. సాధ్యమైనంతవరకు లోకల్ పర్సన్స్ ని పనిలోకి తీసుకోవాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా నేపాలీలు,ఇండ్లలో పనిమనుషులుగా చేరి ఒంటరి వృద్ధులను టార్గెట్ చేస్తూ, దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇళ్ళ యజమానులు మరింత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు

# శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ్ర): శ్రీ గంగా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నేరేడ్ మెట్ బస్ స్టాప్ వద్ద 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని బిర్రు బాలమల్లయ్య, అడ్వైజర్స్ సెర్ల అనిల్, జనరల్ సెక్రెటరీ నయరానా రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి.రామకృష్ణ, బిర్రు రోహిత్,బిర్రు హర్షిత్, బిర్రు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- మిల్లుల వద్ద అన్లోడింగ్ జాప్యంపై సీరియస్..
- రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశం







వనపర్తి జిల్లా ప్రతినిధి, మే (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం గా జరగాలని, అదేవిధంగా మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్లోడింగ్ ప్రక్రియ కూడా వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఏఎస్పి రాజేష్ మీనా తో కలిసి పెద్దమందడి మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి పాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వీరాయిపల్లి సమీపంలోని ఎఫ్ పి ఓ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో దాన్యం నమోదు రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఇన్చార్జ్ లకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా జరగాలని సూచించారు. తేమశాతం నిర్ధారించుకుని వేగంగా కాంటాక్ట్ చేసి కేటాయించిన మిల్లుకు తరలించే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ శాఖ తరపున కేటాయించిన ప్రత్యేక అధికారి కొనుగోలు కేంద్రం వద్ద ఈ పది రోజులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీయగా, ఈ క్రమంలో రైతులు కలెక్టర్ తో మాట్లాడుతూ లారీల ట్రాన్స్పోర్ట్ సమస్య ఉందని, అందువల్లనే ధాన్యం మిల్లులకు తరలించడం ఆలస్యం అవుతుందని తెలియజేశారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ లారీలను అదనంగా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రైస్ మిల్ సందర్శన**

ఖిలా గణపురం మండల పరిధిలోని సోలిపురం గ్రామ శివారులో ఉన్న సింధు ఆగ్రో రైస్ మిల్లు ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లు ఆవరణలో వేచి ఉన్న ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేయించాలని సూచించారు. అదేవిధంగా గోదాంలో ధాన్యం బస్తాల అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. మిల్లు వద్ద మిల్లర్లు ధాన్యంలో తాలు చెక్ చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# చిన్నకేశంపల్లె విద్యార్థులకు టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి నగదు బహుమతి



బద్వేలు, మే 13 (విజన్ ఆంధ్ర) బద్వేలు మండలం చిన్న కేశంపల్లె లో పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త కె.రితీష్ రెడ్డి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేశారు. బుధవారం సాయంత్రం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించిన రితీష్ రెడ్డి ఆ పాఠశాలలో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన టి.అభిషేక్(551), ఎ.దీక్షిత(535), కె.శ్రీదేవి లకు ఒక్కొక్కరికి 5000 చొప్పున ప్రోత్సాహ బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా రితీష్ రెడ్డి మాట్లాడుతూ సరైన అవకాశాలు కల్పిస్తే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తామని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిరూపించారన్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల పై ప్రత్యేక దృష్టి సారించారని, విద్యార్థులకు ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలన్నింటినీ సకాలంలోనే అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి , సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతికి కృషి చేశారని తెలిపారు. చిన్నకేశంపల్లె ప్రభుత్వ పాఠశాలలో చక్కటి మార్కులతో రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రగతికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ సత్ఫలితాలను సాధించేందుకు దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా చిన్నకేశం పల్లెలో అద్భుత ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి బయన పల్లె నుండి శ్రీనివాసపురం మీదుగా చిన్న కేశంపల్లె, చెన్నం పల్లె వరకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజి పెంచలయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి అభినందించడం ఆనందంగా ఉందన్నారు. సమిష్టిగా ఉపాధ్యాయుల కృషితోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.ప్రతాప్ రెడ్డి, జయరామి రెడ్డి, రామచంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు రాజ్ కుమార్ రెడ్డి, సుబ్బారాయుడు, పీరాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో కూలీ మృతి



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ): అనారోగ్యంతో ఓ కూలీ మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పరిగూడకు చెందిన దార శంకర్ (53) దినసరి కూలిగా పని చేస్తున్నాడు.అనారోగ్యం కారణంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మల్కాజిగిరి చౌరస్తాలో పడిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. శవాన్ని గాంధీ మార్చురీ కి షిఫ్ట్ చేసి బంధువులకు సమాచారం అందించారు. కేసును ఎస్ ఐ జితేందర్ సింగ్ దర్యాప్తు చేస్తున్నారు

# హైకోర్టు తీర్పు నేపథ్యంలో పీచర చెరువులో చేపలు పట్టిన ముదిరాజ్ లు



నిర్మల్. మే 13. ( విజన్ ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామంలోని ముదిరాజ్ లు గ్రామంలో 5 చెరువులు ఉన్నప్పటికీ కొన్ని దశాబ్దాలుగా పక్కనే ఉన్న గోదావరిలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని చెరువుల్లో గూండ్ల కులస్తులతో పాటు తమకూ చేపలు పెంచుకునే అధికారం కోసం హైకోర్టులో కొన్ని సం.తర్వాత తీర్పు అనుకూలంగా రావడంతో ఈరోజు గ్రామంలోని ఊర చెరువులో చేపలు పట్టే క్రమంలో గ్రామస్తులకు ముదిరాజ్ లకు వాదనలు జరగడంతో పోలీసులు వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ): సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.డివిజన్ వారీగా లబ్ధిదారులకు అందించిన సహాయం వివరాలు ఇలా ఉన్నాయి. వినాయక్ నగర్ డివిజన్ శైలజ రూ60,000, నాగరాజు రూ10,000వెంకట నాగరాజు రూ 19,500,శిరీష 51,000, మౌలాలి డివిజన్ సాయి కిరణ్ రూ 60,000, యాదగిరి రూ 60,000, శ్యామల రూ 52,000 అనిత రూ 21,000. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ శ్రీనివాస్ రూ 21,500, గౌతమ్ నగర్ డివిజన్ వసంత రూ 25,000 కుశాల్ రావు రూ45,500 శ్రావణి రూ35,000 & రూ11,000, పద్మావతి రూ 16,500, లావణ్య రూ 52,000 మంజూరైనాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు అవసరమైన సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాముయాదవ్, అమినుద్దీన్, ప్రభాకర్ రెడ్డి, బంగారు మల్లేశం చారి, కేబుల్ రమేష్, ప్రభాకర్ గౌడ్, వైశాలి, నవాబ్, సంతోష్ గుప్తా, రాజశేఖర్ రెడ్డి, మహేష్, బాలకృష్ణ, సాయి, సాగర్, ఫరీద్, ఉమేష్, సంపత్ యాదవ్, సురేష్, ఉస్మాన్, మారుతి ప్రసాద్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు బంద్

### - జె.ప్రభుదాస్



మల్కాజిగిరి, మే 13,(విజన్ ఆంధ్ర): సెంట్రింగ్ కాంట్రాక్టర్ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పనులను బంద్ చేయాలని లాలాపేట కమిటీ అధ్యక్షుడు జె. ప్రభుదాస్ పిలుపునిచ్చారు. లాలాపేట డివిజన్‌లోని సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 16వ తేదీ వరకు వాయిదా ఉండగా, ఆలోపు సమస్యలు నివృత్తి చేయాలని సెంట్రింగ్ వర్కర్లు సంఘంగా బంద్ చేయాలని తీర్మానించామని తెలిపారు. ముఖ్యంగా సెంట్రింగ్ కాంట్రాక్టర్ ప్రధాన డిమాండ్లను పరిష్కరించే వరకు బంద్ పాటించాలని ఆయన కోరారు. సెంట్రింగ్ రేటు రూ. 51కు పెంచాలని, సెంట్రింగ్ కార్మికులకు ఇన్సూరెన్స్, లేబర్ బిల్స్ అగ్రిమెంట్ రాయించాలని, ప్రమాదవశాత్తు భవనం కూలి చనిపోయిన కార్మికుడికి రూ. 20 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీ వినాయక సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు వరసగా పి.ఐలయ్య, జె.దాస్, జె.అశోక్, డి.శ్రీకాంత్, బి.పరశరము, ఎం.లింగం, జె.కిష్టయ్య, నాగార్జున, నాగయ్య, కిషన్, జీ.రవీందర్, ఎం.శ్రీనివాస్, ఎం.బాబు,ఎన్.బాలరాజు, ఎ.బాలరాజు, రమేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# మండల యువజన అధ్యక్షుడిగా బండి మధు ఎన్నిక.



ములుగు మే 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మండల యువజన కాంగ్రెస్ పూర్తి కమిటీని జిల్లా అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బండి మధును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, పలువురిని వివిధ పదవులకు నియమించారు. మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోకన్న ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడు బండి మధుకు నాయకులు శాలువాతో సత్కారం చేశారు. యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానని బండి మధు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# జనగణనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

- ప్రతి గ్రామం, పట్టణంలో విస్తృత ప్రచారం
- ప్రచార వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఆదర్శ్ సురభి





వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 13 (విజన్ ఆంధ్ర) : జనగణన2027పై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించే విధంగా ప్రచార వాహనం ప్రతి గ్రామం, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్ ప్రాంగణంలో జనగణన2027 ప్రచార వాహనాన్ని అదనపు ఎస్పీ రాజేష్ మీనా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన2027పై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించే విధంగా ప్రచార వాహనం ప్రతి గ్రామం, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సరైన సమాచారం నమోదు ప్రాధాన్యతపై వివరించాలని తెలిపారు. ప్రజలు జనగణన ప్రక్రియలో చురుకుగా పాల్గొని ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు మరియు అభివృద్ధి ప్రణాళికలకు ఉపయోగపడుతుందని అన్నారు. అధికారులు ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి జనగణన2027ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఏవో భాను ప్రకాష్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## పశువుల అక్రమ రవాణా ప నిఘా

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 13 ( విజన్ ఆంధ్ర ) : రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని అక్రమ రవాణాను అరికట్టడానికి శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతారం గ్రామం వద్ద, అలాగే ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆమె పలు కీలక సూచనలు చేశారు.తనిఖీల్లో భాగంగా ఎస్పీ మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుండి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు డయల్ 100 ద్వారా తెలియజేయాలి. ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ధారూర్ ఇన్స్పెక్టర్ రఘు రాములు, ఎస్.ఐ రాఘవేందర్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలి



సూర్యాపేట మే 13:(విజన్ ఆంధ్ర)ఆలయ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి అభివృద్ధి నూతన కమిటీ పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. పదవులను న్యాయబద్ధంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు పటేల్ రమేష్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, దండ అరవింద్ రెడ్డి, ధరవత్ ధర్మ నాయక్,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవరశెట్టి రవిశంకర్, అప్పల చార్యులు, పోతుగంటి వెంకటేశ్వర్లు, నకిరేకంటి భరత్ కుమార్, మనసాని నాగేశ్వరరావు, భారతి, చీదెళ్ల పర్వతాలు, చల్ల పాండయ్య, భువనగిరి వెంకన్న, మర్ల కరుణాకర్ రెడ్డి, లక్ష్మీకాంతు, పిల్లల భవాని, గుండె కృష్ణ, తెడ్ల పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది



సూర్యాపేట మే 13:(విజన్ ఆంధ్ర)బీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని సూర్యాపేట యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద నీట్ పరీక్షల రద్దు, ప్రశ్నా పత్రాల లీకేజీ ఘటనలపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ ఖలీద్ అహ్మద్, భవ్య, రోహిణి సూచనల మేరకు మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలను అనిశ్చితిలోకి బిజెపి ప్రభుత్వం నెట్టిందన్నారు.గత పది సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే చివరికి పరీక్షలను రద్దు చేయడం వారి భవిష్యత్తుతో ఆటలాడటమేనని మండిపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పూర్తిగా విఫలమైందన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వ విధానాలను యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, నరేందర్ నాయుడు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బి వినయ్, సుదీర్, వికాస్, అబ్బాస్, శ్రీకాంత్, అఖిల్, నరేష్, శివ, లక్ష్మణ్ ,మహేష్, రేష్ డి శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ అర్బన్ 2.0 లో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 13, 2026: విజన్ ఆంధ్రస్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 లో భాగంగా జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తడి చెత్త, పొడి చెత్తను క్రమం తప్పకుండా సేకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో న్యూఢిల్లీ నుండి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖల అడిషనల్ డైరెక్టర్ డా. అమిత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తప్పనిసరిగా ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని, ఆ దిశగా పంచాయితీ, మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. వచ్చే వర్షాకాలం ప్రారంభానికి ముందే మురుగు కాలువలలో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మి నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరి కిరణ్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 13,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల నగర పాలక సంస్థ లోని పలు డివిజన్ లలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం లో బుధవారం మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ పాల్గొని ప్రారంభించారు. 10,17,18,29,30,39 డివిజన్ లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని వాటిని ప్రారంభించడం ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆశీస్సులతో పలు డివిజన్లలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని అన్నారు. పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు విడతల వారిగా సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా ఎమ్మెల్యే కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మేయర్,డిప్యూటీ మేయర్,స్థానిక కార్పొరేటర్ల ను సన్మానించారు. రానున్న రోజుల్లో వంద శాతం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందజేయడానికి ఎమ్మెల్యే పట్టుదలతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాచకొండ గోపాల్ రావు,లగిసెట్టి రాజయ్య,బియ్యాల త్రివేణి, పుదరి సునీత ప్రభాకర్, కర్రె శ్రీనివాస్,బండారి సుధాకర్,ఆయా డివిజన్ల వార్డ్ ఆఫీసర్లు,స్థానిక కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకులు,యువజన నాయకులు వివిధ డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి

### – జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 13, 2026: విజన్ ఆంధ్రప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక చర్యలు చేపడుతుందని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ లతో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలపై ఆసిఫాబాద్ నియోజకవర్గ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపొందించడం అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదరించడం వలన విద్యార్థుల ప్రవేశాలు పెరిగి చదువు మధ్యలో మానేవేసే పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రతినెల పాఠశాలలను సందర్శించడం, బడి వయసు పిల్లలు ప్రభుత్వం పాఠశాలలో చేరేలా చూడడం, ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ కమిటీ సమావేశాలలో పాల్గొనడం, పాఠశాలల పరిశుభ్రతను పర్యవేక్షించడం, పాఠశాలలలో నెలకొన్న చిన్న సమస్యలను పరిష్కరించడం, బాలిక విద్యను ప్రోత్సహించడం, దివ్యాంగ పిల్లలకు మద్దతునిచ్చి వారికి భరోసా కల్పించడం, క్రీడలకు తమ ప్రోత్సాహాన్ని అందించడం, పాఠశాల విద్యార్థుల ప్రతిభను, విజయాలను ప్రచారం చేయడం, పాఠశాలలను గౌరవంగా చూసుకునేలా సర్పంచులు, కౌన్సిలర్లు, పంచాయతీ పాలకవర్గం భాగస్వాములు కావాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమయపాలన, నాణ్యమైన విద్య బోధనపై పర్యవేక్షించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్‌గా చరణ్ కౌశిక్ యాదవ్ ప్రమాణ స్వీకారం

### శుభాకాంక్షలు తెలిపిన తుంగతుర్తి రవి,కాంగ్రెస్ నాయకులు



బోడుప్పల్,మే 13(విజన్ ఆంధ్ర) : తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చరణ్ కౌశిక్ యాదవ్‌ను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన తుంగతుర్తి రవి చైర్మన్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకుడు చరణ్ కౌశిక్ యాదవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా పాడి రైతులు మరియు పశుపోషకులకు సంబంధించిన కార్యక్రమాలు ఆయన నాయకత్వంలో మరింత సమర్థవంతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సంస్థ రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధికి కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బండి రాళ్ల భాస్కర్, కవిడె కుమార్, మహ్మద్ మజర్, మహిళా అధ్యక్షురాలు ఎన్ఎన్‌కే దుర్గ, కోమలతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

### జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 13 (విజన్ ఆంధ్ర) : ఆధునిక విద్యా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలుతీసుకుంటుందని, విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషి చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అన్నారు. బుధవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశం హాలు నందు సర్పంచ్ లకు కౌన్సిలర్ లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా వికారాబాద్ జిల్లా మున్సిపల్ చైర్మన్ గడ్డం అన్యన్య జ్యోతి ప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల సందర్భంగా , వికారాబాద్ నియోజకవర్గం అయిదు మండలాలకు సంబంధించి సర్పంచులు , నియోజక వర్గ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యా బాట అని ఈ సందర్భంగా అన్నారు.తెలంగాణా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నాణ్య మైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలు , డిజిటల్ విద్యా,విద్యార్థి సంక్షేమం , సమాజ భాగస్వామ్యం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఇట్టి కార్యక్రమాలపై సర్పంచులు , కౌన్సిలర్లు అందరు అవగాహన కలిపించుకొని ప్రతిరోజూ కొద్దిసేపు సమయం కేటాయించి మీ గ్రామంలో ఉండే పాఠశాలలను సందర్శించి, విద్యా, మౌళిక వసతులు, వాటిపై దృష్టి సారించాలని, బడి ఈడు పిల్లలు స్కూల్ కు వస్తున్నారా, ఉపాధ్యాయులు వస్తున్నారా, అక్కడి సమస్యలను తెలుసుకోవాలని, విద్యార్థుల హాజరు శాతం రిజిస్టర్లు చెక్ చేయాలనీ, గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని , ప్రామాణికమైన బాధ్యత మీపై ఉందని అన్నారు. ఎఫ్ ఎల్ ఏం, కే జి బివి, మధ్యాహ్నం భోజనం, బాల్య వివాహాలు , డిజిటల్, టి వి, ఫోన్లు, టెక్నికల్ వినియోగం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అల్పాహారం , మధ్యాహ్న భోజనం , అనేక వసతులు కల్పిస్తుందని అన్నారు. బాలికల విద్యనూ ప్రోత్సహిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు. అధికారులు మాట్లాడారు. విద్యా లక్ష్యం, పనిచేసే విధానం,విద్యలో స్తానిక సంస్థల పాత్ర,అమ్మ ఆదర్శ పాటశాల , మౌలిక వసతులు, ఎఫ్ ఎల్ ఎం , కే జి బి వి , బాలికల విద్యా మధ్యాహ్న భోజనం, బాల్య వివాహాలు డిజిటల్ వినియోగము పై ఉపాధ్యాయులు పి పి టి ద్వార అవగాహనా కలిపించారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న నిక్షిప్త చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది.ఈ సమావేశములో వైస్ చైర్మెన్ అర్ద సుధాకర్ రెడ్డి, విద్యా శాఖ అధికారి రేణుక దేవి, మండల విద్యాదికారులు , బంట్వారం , మర్పల్లి, ధరూర్, కోట్ పల్లి, వికారాబాద్ మండలాలకు సంబంధించిన సర్పంచులు, కౌన్సిలర్లు ,జిల్లా అధికారులు తదితరలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు తోడ్పడాలి: జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

చేవెళ్ల, మే 13 (విజన్ ఆంధ్ర):ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి ప్రభుత్వ విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు, కౌన్సిలర్లు భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల జీపీఆర్ కన్వెన్షన్ హాల్లో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, నవాబుపేట్ మండలాల సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లకు నియోజకవర్గస్థాయి ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, విద్యార్థులకు అందిస్తున్న వసతులను వివరించారు. ప్రీ – ప్రైమరీ తరగతుల ద్వారా చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమతావెంకట్ రెడ్డి, మొయినాబాద్ చైర్‌పర్సన్ సోనియాదర్శన్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఆర్డీఓ పార్థసారథి రెడ్డి, ఎంపీడీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ పురాన్ దాస్, ఐదు మండలాల సీఆర్‌పీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సిబిఎస్ఈ 12వ ఫలితాల్లో హెచ్‌పిఎస్ఆర్ విద్యార్థుల హవా



హైదరాబాద్, మే 13 (విజన్ ఆంధ్ర) : సీబీఎస్ఈ 12వ తరగతి బోర్డు పరీక్షల ఫలితాల్లో నగరంలోని హెచ్‌పిఎస్ఆర్ నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల అంకితభావం, కృషి, అధ్యాపకుల నిబద్ధత, తల్లిదండ్రుల నిరంతర మద్దతుకు నిదర్శనంగా ఈ పాఠశాల సైన్స్, కామర్స్, హ్యూమానిటీస్ విభాగాలలో అద్భుతమైన ప్రదర్శనను నమోదు చేసిందన్నారు. పాఠశాల హెడ్ గర్ల్ అయిన రాగా ప్రణవి, కామర్స్ విభాగంలో 96 శాతం మార్కులతో ఓవరాల్ టాపర్‌గా నిలవగా, ఆమె తర్వాతి స్థానంలో మానస్ 90.6 శాతం మార్కులతో నిలిచాడని తెలిపారు. సైన్స్ విభాగంలో సుకృతి గార్గ్ 94 శాతం అద్భుతమైన మార్కులు సాధించగా, తరుణ్ 92.4 శాతం మార్కులు సాధించాడని తెలిపారు. హ్యూమానిటీస్ విభాగంలో హేమీమా 83 శాతం, నిమిష్ 79.4 శాతం మార్కులు సాధించినట్లు చెప్పారు.

## ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు పూర్తి చేయాలి

### ...జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 13, 2026: విజన్ ఆంధ్రప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ ఈ నెల చివరి వరకు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లతో ఆసిఫాబాద్ నియోజకవర్గస్థాయి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు 100 శాతం పూర్తి చేయాలని, నియోజకవర్గంలోని మండలాల తహసిల్దార్లు, ఎ పి ఎం లు, సూపర్వైజర్లు మ్యాపింగ్ శాతం తక్కువ ఉన్న ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. మరణించిన ఓటర్లు, గ్రామంను వదిలి వెళ్ళిపోయిన ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. సెర్ప్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకోవాలని, రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని, మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్లతో ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల జారీ, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ వేగవంతం చేయడానికి ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, గిర్దావార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసెస్మెంట్ నెంబర్ కోసం నాలుగు లక్షలా!

## ఆర్.ఓ శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు
## ఆర్.ఓపై కౌన్సిలర్ మండిపడటం నిజమేనా!
## నాకేమీ సంబంధం లేదంటున్న ఆర్.ఓ



పటాన్ చెరు, మే 12 (విజన్ ఆంధ్ర ) :పటాన్ చెరు పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీలో ఓ హాస్పిటల్ భవనానికి అసెస్మెంట్ నెంబర్ కేటాయింపు ఇప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచింది. ఓ హాస్పిటల్ భవనానికి అసెస్మెంట్ నెంబర్ కేటాయింపు విషయంలో ఆర్.ఓ శ్రీనివాసులరెడ్డి 4లక్షల రూపాయలు డిమాండ్ చేశారన్న ప్రచారం జోరుగాసాగుతోంది. సాధారణంగా ఒక భవనం పూర్తి అయితే ఆర్.ఐ ఆ భవనాన్ని విజిట్ చేసి, తన లాగిన్‌లో మంజూరు చేస్తే ఆ తరువాత ఆర్.ఓ శ్రీనివాస్ రెడ్డి తన లాగిన్ లో ఆమోదిస్తే, కమిషనర్ లాగిన్‌కు వెళుతుంది. అక్కడ కమిషనర్ కూడా అసెస్మెంట్ నెంబర్ ఓకే చేస్తే ఫైనల్‌గా అసెస్మెంట్ నెంబర్ వస్తుంది. ఇదే తరహాలో ఇంద్రేశం మున్సిపాలిటీలో ఓ హాస్పిటల్ భవనాన్ని ఆర్ ఐ తనిఖీ చేసిన తరువాత ఆర్.ఓ శ్రీనివాస్ రెడ్డి 4లక్షలు




అడిగారని, ఈ విషయం తెలుసుకున్న ఒక కౌన్సిలర్ ఆర్.ఓపై మండిపడ్డారని సమాచారం. అసెస్మెంట్ నెంబర్ విషయంలో మున్సిపల్ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారని తెలుస్తోందినాకెటువంటి సంబంధం లేదు – ఆర్.ఓ శ్రీనివాస్ రెడ్డిఈ విషయంపై ఆర్.ఓ శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, అసలు ఇంద్రేశంలో హాస్పటల్ విషయం నాకు తెలియదని అన్నారు. అయినా అసెస్మెంట్ విషయంలో కమిషనరే ఫైనల్ చేస్తారని, భవనం ఎంక్వయిరీకి ఆర్ ఐ వెళ్తారని, తాను వెళ్లనని, తనకు ఆ నాలుగు లక్షలకు ఎటువంటి సంబంధం లేదని, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.

# రామన్నపేటలో ఆధ్యాత్మిక శోభితం.. ప్రతిష్ఠాపన మహోత్సవం

## – ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
## –ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల విరాళం
## – అట్టహాసంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఖమ్మం జిల్లా బ్యూరో , మే 13 (విజన్ ఆంధ్ర) : భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, ధార్మిక కార్యక్రమాలతో లోక కల్యాణం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ 60వ డివిజన్ పరిధిలోని రామన్నపేటలో బుధవారం అత్యంత వైభవంగా జరిగిన శ్రీ పెద్దమ్మ తల్లి, పోతురాజు, సింహ వాహన, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రికి ఘన స్వాగతంఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి పొంగులేటికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, గ్రామాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ. 50,000 విరాళాన్ని అందజేసి మంత్రి పొంగులేటి తన భక్తి భావాన్ని చాటుకున్నారు.శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా పర్వంమూడు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవాలు బుధవారం నాటి ప్రధాన ఘట్టంతో ముగిశాయి. ఉదయం 9:24 గంటలకు సుముహూర్తాన వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రస్థాపన, బింబస్థాపన నిర్వహించారు. పంచముఖి నాగేంద్రుడు, జంటనాగుల ప్రతిష్ఠాపన , నేత్రోన్మీలన, ప్రాణప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా పూర్తి చేశారుమంత్రి పర్యటనతో రామన్నపేటలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రతిష్ఠా కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, రామన్నపేట పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నంగునూరు మండలం లోనివరిధాన్యంకొనుగోలుకేంద్రాన్నిసందర్శించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 13 మే సిద్దిపేట జిల్లా లోగల ప్రభుత్వ కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగ వంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, సంగునూరు మండలం ముండ్రాయి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్క్షేత్రస్థాయిలోపరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని ఏఎంసి లలో మాత్రమే మక్కల కొనుగోలు సైతం వేగంగా కొనసాగుతుందని తెలిపారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చెయ్యడానికి తయారుగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చే వరకు ఆగకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్ ఇతరత్ర వాహనాలలో ధాన్యాన్ని నింపి మిల్లులకుతరలించాలనిఆదేశించారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని సెంటర్ లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, మిల్లులో దిగుమతిలో జాప్యం జరగకుండా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

# శ్రవన్స్ ఆర్ట్స్ & కల్చరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాన్సింగ్ స్టార్స్ - 2026




హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 13 (విజన్ ఆంధ్ర)స్టేట్ లెవల్ కల్చరల్ ఫెస్ట్ మే 16న కళోజి కళాక్షేత్రంలో జరగబోతున్నది. ఇందులో అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాము. పూర్తి వివరాల కోసం 9908743178/9014013179 నంబర్లను సంప్రదించగలరు. కళలను అభివృద్ధి చేయాలి, కళాకారులకు ఒక మంచి వేదికను కల్పించాలి, వారి టాలెంటు ప్రపందానికి తెలియజేయాలి అనేదే మా ముఖ్య ఉద్దేశ్యం. దీనితో పాటు అంధులు, అనాధలు మరియు వృద్ధులకు సహాయం చేసే కార్యక్రమాలు కూడా నిర్వహించబోతున్నాము. గతంలో కూడా మేము అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాము. ఇదివరకు నిర్వహించిన కార్యక్రమాలకు టాప్ కొరియోగ్రాఫర్స్ అయిన శేఖర్ మాస్టర్ మరియు యశ్వంత్ మాస్టర్ స్ను మన వరంగల్కు తీసుకురావడం జరిగింది. ఈసారి ఫోక్ సాంగస్కు అదిరిపోయే స్టెప్పోస్తో యావత్ ప్రపంచాన్ని డాన్స్ మయం చేస్తున్న కొరియోగ్రాఫర్ శేఖర్ వైరన్ గారిని ఆహ్వానించబోతున్నాము. ముఖ్య అతిథులుగా ఎంపీ కడియం కావ్య , ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిఎ,కూడా చైర్మన్ ఇనిగాల వెంకట్రామ్ రెడ్డి హాజరు కానున్నారని ట్రస్ట్ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ గాదె శ్రవణ్ కుమార్ తెలిపారు. వీరితో పాటు వైస్ ప్రెసిడెంట్ గాదె సందీప్ కుమార్, డాన్స్ మాస్టర్ సౌరం జితేందర్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు

# మొక్కజొన్న నిల్వకు అధిక సామర్థ్యం గల గోదాలను సిద్ధం చేయండి

## - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### కొనుగోలు కేంద్రాల నుంచి మొక్కజొన్న తరలింపు చేపట్టాలి
### ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న రవాణా నిల్వల ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం జిల్లా బ్యూరో , మే 13(విజన్ ఆంధ్ర): జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా సామర్థ్యం గల గోదాంలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఖమ్మం త్రీ టౌన్ లోని వ్యవసాయ మార్కెట్ నందు మొక్కజొన్న నిల్వల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగొలు చేసిన మొక్కజొన్న గోదాములకు తరలింపు రవాణా ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పరిశీలించారు. మిర్చి, పత్తి మార్కెట్ లలో మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలకు అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ స్టోరేజ్ గోదాములను గుర్తించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, సంబంధిత శాఖల అధికారులు, మార్కెట్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో పండుగలు జరుకోవాలి

## బక్రీద్ పండుగకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు
## వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 13,(విజన్ ఆంధ్ర)రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) శ్రీ సి.వి. ఆనంద్ అన్నారు. బుధవారం రాష్ట్రంలోని ఆయా కమీషనర్ లు, జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో జరుపుకునేలా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, ఈద్గాలు, మసీదులు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మరియు జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాలలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగ రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి,వాహన రాకపోకలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈద్గాల వద్ద పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులు లేదా వదంతులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డిజిపి ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణం నెలకొల్పాలని తెలిపారు. సున్నిత ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి,డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. చెక్ పోస్టులలో 24 గంటలు సిబ్బంది విధులు నిర్వహించాలని, పోలీస్ సిబ్బంది మరియు మునిసిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కో-ఆర్డినేషన్ పద్ధతిలో విధులు నిర్వహించాలని తెలిపారు. పండుగ సందర్భంగా విధుల్లో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని డిజిపి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ కుమార్ ఝా,మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీ లు ఎ.భాస్కర్, రాంరెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, ఎసిపి ప్రకాష్, రమేష్ మరియు ఎసిపి స్పెషల్ బ్రాంచ్ నాగేందర్ గౌడ్, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పాలేరుకు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ రాక

## ధాన్యం కొనుగోలు ప్రక్రియపై క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్న మంత్రులు

ఖమ్మం జిల్లా బ్యూరో, మే 13(విజన్ ఆంధ్ర) : ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని పాలేరు గ్రామంలో ఇటీవల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రరెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం సందర్శించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మంత్రులు నేరుగా కొనుగోలు కేంద్రానికి చేరుకుంటారన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ ఏ విధంగా జరుగుతోంది? మద్దతు ధర అమలులో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అన్న అంశాలను మంత్రులు స్వయంగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ముఖ్యంగా తూకంలో పారదర్శకత, గోనె సంచుల లభ్యత, సేకరించిన ధాన్యం మిల్లులకు తరలింపు వంటి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సోదరులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దయాకర్ రెడ్డి కోరారు.

# కేర్ హాస్పిటల్స్ లో అరుదైన శ్వాసనాళ చికిత్స

హైదరాబాద్, మే 13 (విజన్ ఆంధ్ర) : వెన్నెముక శస్త్రచికిత్స తర్వాత నెలల తరబడి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ, సరిగా మాట్లాడలేని 60 ఏళ్ల రోగికి కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీలో వైద్యులు అత్యాధునిక శ్వాసనాళ చికిత్స నిర్వహించి మళ్లీ సాధారణ శ్వాస, మాట్లాడే సామర్థ్యాన్ని కల్పించినట్లు హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సతీష్ సి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కన్సల్టెంట్ ఈఎన్టీ, హెడ్, నెక్ సర్జరీ నిపుణుడు డాక్టర్



ఎం.అబ్దుల్ అమ్జాద్ ఖాన్ తోకలసి ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఈ రోగి ప్రమాదంలో గాయ పడడంతో ముందుగా వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. కోలుకునే సమయంలో శ్వాస సౌకర్యం కోసం ట్రాకియోస్టమీ చేశారని, అయితే అనంతర కాలంలో పలుమార్లు ట్యూబ్ తొలగించే ప్రయత్నాలు చేసినా విజయవంతం కాలేదన్నారు. దీంతో రోగి శ్వాస తీసుకోవడమే కాకుండా మాట్లాడటంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

# మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్


## – రైతుల సమస్యలపై అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచన

జహీరాబాద్ మే 13 (విజన్ఆంధ్ర): రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ధాన్యాన్ని సకాలంలో తరలించకపోవడంతో గోడౌన్‌లలో వేలాది బస్తాలు నిల్వ ఉండిపోయాయని తెలిపారు. అదనంగా వస్తున్న ధాన్యాన్ని రైతులు రోడ్డుపై నిల్వ ఉంచి రోజులు తరబడి పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాతావరణ మార్పులతో ధాన్యం పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, గోడౌన్‌లో 6 వేల బస్తాలకు పైగా ధాన్యం నిల్వ ఉందని, వెంటనే సరిపడా రవాణా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు 20 నుంచి 30 రోజుల పాటు మార్కెట్ యార్డుల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. నిబంధనల పేరుతో పరిమితంగా కొనుగోళ్లు జరపడం వల్ల దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసి, అధికారులతో కుమ్మక్కై అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రవాణా, హమాలీ తదితర ఖర్చుల పేరిట రైతులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని పేర్కొంటూ, రైతు డిక్లరేషన్ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింలు, సర్పంచ్ మచ్చేందర్, మాజీ కేతకి ఆలయ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పునాది విద్య

## శాసనమండ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి
## విద్యా వారోత్సవం సందర్భంగా సర్పంచులు,కార్పొరేటర్లకు అవగాహన సదస్సు

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, మే13,(విజన్ ఆంధ్ర):అభివృద్ధికి పునాది విద్య అని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నల్గొండ టీటీడీసీలో నియోజకవర్గ స్థాయి సర్పంచులు,కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులకు విద్యపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు:ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే విద్య ఉంటుందో అక్కడ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 8 శాతం విద్య కోసం కేటాయిస్తోందని తెలిపారు. ప్రతి సర్పంచ్, కార్పొరేటర్ నెలకు కనీసం ఒకసారి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యా బోధన, మౌలిక వసతులపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా,12 వేల ప్రైవేట్ పాఠశాలల్లో 39 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడికి 30 మంది విద్యార్థులు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. గతంలో టీచర్లు గ్రామాల్లోనే ఉండి విద్యార్థులతో క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారని,ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం విద్య కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని,విద్యా కిట్‌లు,యూనిఫామ్‌లు, స్కాలర్‌షిప్‌లు అందజేస్తోందని తెలిపారు. ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయల వ్యయంతో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా విద్యా వారోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, కార్పొరేటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యను అందరికీ చేరువ చేసిన మహనీయులు సావిత్రిబాయి పూలే,జ్యోతిరావు పూలేలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తోందని తెలిపారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 98.47



శాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ కూడా అందిస్తోందని వెల్లడించారు. జిల్లాలో 43 పీఎం శ్రీ పాఠశాలల్లో ల్యాబ్‌లు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్‌లు,పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నందున బడిబాట కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పెరుగుతున్నాయని చెప్పారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం ఎన్నో నిధులను కేటాయిస్తోందని,విద్యతో సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌లు,ల్యాబ్స్ ఉన్నాయని,తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, స్థానిక కార్పొరేటర్ పున్నా జ్ఞానేశ్వరి,సర్పంచులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

